క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ఉత్సవాల ఆహ్వాన పత్రిక అందజేత



భీమవరంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పట్టణంలోని చినఅమిరం శ్రీసీతారామాంజనేయ ఆలయ సప్తాహ ఉత్సవాలకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను ఉత్సవ కమిటీ ఆహ్వానించింది. మంగళవారం క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస్‌ను కలసి ఆహ్వాన పత్రికను కమిటీ ప్రతినిధులు అందజేశారు. వేగేశ్న వర్మరాజు, బుద్ధరాజు శ్రీనివాసరాజు, గొట్టుముక్కల మురళీకృష్ణంరాజు, వత్సవాయి నారాయణరాజు, గొట్టుముక్కల విశ్వనాథరాజు పాల్గొన్నారు.

కాళ్ల ఎస్సైగా మూర్తి



పీవీఎల్‌ను కలిసి మొక్క అందిస్తున్న ఎస్సై మూర్తి

కాళ్ల: కాళ్ల ఎస్సైగా ఏజీఎస్ మూర్తి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్సై డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. సాధారణ బదిలీల్లో భాగంగా భీమవరం డీసీఆర్‌బీ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ఇప్పటివరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసిన ఆర్. మల్లికార్జునరెడ్డి భీమవరం ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు బదిలీ అయ్యారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న మోషేన్‌రాజు

సాక్షి, భీమవరం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలును కోల్పోయిన గునుపూడి గురువుపేటకు చెందిన మద్దా జోషి అనే వ్యక్తికి ఆ ప్రాంతవాసులు అండగా నిలిచారు. గరువుపేట యూత్ సుమారు రూ.లక్ష సేకరించి శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు చేతుల మీదుగా అందజేశారు. ఆపద సమయంలో వైద్య సహాయం నిమిత్తం సహకరించిన మోషేన్‌రాజుకు, ఆర్థిక సాయం అందజేసిన గరువుపేట వాసులకు ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన మద్దా జోషి కృతజ్ఞతలు తెలిపారు.

రేపు యుపీఎఫ్ సమావేశం

ఉండి: యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్(యుపీఎఫ్) మండల సమావేశం గురువారం చెరుకువాడ సగర్ల శాంతినగర్‌లోని సమస్త జనుల యేసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో నిర్వహిస్తున్నట్లు బ్రదర్ ఎరిచర్ల ఇష్మాయిల్, సిస్టర్ హెప్సీ మంగళవారం తెలిపారు. మండలంలోని 19 గ్రామాల్లోని గౌరవ యూపీఎఫ్ సభ్యులంతా తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరుకావాలని వారు కోరారు.

వర్మీ కంపోస్ట్‌పై అవగాహన

కాళ్ల: భీమవరం డీఎన్ఆర్ కాలేజీ విద్యార్థులు కోపల్లెలో వర్మి కంపోస్టు విభాగాన్ని మంగళవారం పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపల్ బి.శాంతకుమారి ఆధ్వర్యంలో అప్లైడ్ సైన్స్ విభాగానికి చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు కంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంపోస్టు తయారీపై అవగాహన కల్పించారు. ఉపసర్పంచ్ బూడి వెంకటపరాలు, సెక్రటరీ బాలకృష్ణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

కాళ్ల: మాయమాటలు చెప్పి వివాహేతర సంబంధం కారణంగా గర్భం దాల్చడంతో బాలిక ఫిర్యాదు మేరకు మంగళవారం పోక్సో కేసు నమోదు చేశామని ఆకివీడు సీఐ గీతా రామకృష్ణ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దొడ్డనపూడి గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన 23 ఏళ్ల యువకుడు ప్రేమిస్తున్నానంటూ వెంటపడటంతో వారిద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ తరుణంలో బాలిక గర్భం దాల్చడంతో ఇరు కుటుంబాల మధ్య సఖ్యత బెడిసి కొట్టింది. బాలిక ఫిర్యాదు మేరకు నిందితుడు రాజేష్‌పై పోక్సో, అత్యాచారం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారని సీఐ చెప్పారు.

హెచ్‌ఎంపై ఫిర్యాదు

వీరవాసరం: తోకలపూడి ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం బిందుమాధవిపై మంగళవారం వీరవాసరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాఠశాల విద్యాకమిటీగా పనిచేస్తున్న బొబ్బనపల్లి దుర్గను పదవీకి రాజీనామా చేయాలని వాట్సాప్‌లో మెసేజ్ పంపిన హెచ్‌ఎంపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని దళిత సంఘ నాయకులు వీరవాసరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గుండే నగేష్‌బాబు, వెంకట్రావు, బొంతు రమేష్, బాల సుందరం, ప్రసాద్, పోతురాజు ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించను



భీమవరంలో పబ్లిక్‌హెల్త్ డీఈతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్



మునిసిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: ప్రజావసరాలకోసం చేపడుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేదిలేదని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ హెచ్చరించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం పట్టణంలోని టిడ్కో గృహాల వద్ద నిర్మిస్తున్న మురుగు నీటిని శుద్ధిపరిచే ఎస్టీపీ పనులపై సమీక్షిస్తూ పబ్లిక్ హెల్త్ డీఈ విజయ్‌పై తీవ్రంగా మండిపడ్డారు. ఎస్టీపీ నిర్మాణానికి 2018లో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ వర్క్ ఆర్డర్ తీసుకుని 15 నెలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. పనులు పూర్తిచేయడంలో కాంట్రాక్టర్ తీవ్ర జాప్యం చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర తప్పిదమన్నారు. తక్షణం కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేసి పనులు పూర్తి చేయించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ట్యాంక్ పనులు పూర్తి అయితేనే టిడ్కో గృహాల్లో నివసించే ప్రజల వాడకపు నీటిని శుద్ధిచేసి పూర్తిగా బయటకు వదలడానికి అవకాశం ఉంటుందన్నారు. పనుల్లో జాప్యం జరిగితే ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. ట్యాంక్ పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం సమస్యను ఎమ్మెల్యే ఫోన్‌లో కలెక్టర్ పి.ప్రశాంతికి వివరించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

పట్టణంలో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

సాక్షి, భీమవరం: పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మునిసిపల్ అధికారులతో స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలో చేపట్టిన రోడ్ల అభివృద్ధి పనులు వర్క్ ఆర్డర్ ఇచ్చినా ప్రారంభించని పనులపై మున్సిపల్ ఎంఈ త్రినాథ్, విద్యుత్ శాఖ ఏడీ రాజగోపాల్ చౌదరి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ గౌరు, డీఈ నారాయణరావు, సర్వేయర్ రమాభాయితో పనుల అభివృద్ధిపై సమీక్షించారు. అనంతరం శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ పట్టణాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. అభివృద్ధికి ప్రజలు కూడా సహాయ, సహకారాలు అందించాలన్నారు. జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణాన్ని ప్రజలకు పూర్తి సౌకర్యాలు కల్పించడంతోపాటు మరిన్ని హంగులతో సుందరంగా తీర్చిదిద్దడానికి శక్తివంచన లేకుండా పనిచేస్తున్నామన్నారు. అలాగే ట్రాఫిక్ సమస్యకు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు.

అగ్నికుల క్షత్రియుల సంక్షేమానికి కృషి



ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు జ్ఞాపికను అందిస్తున్న అగ్నికుల క్షత్రియ యువజన సంఘం నాయకులు

సాక్షి, భీమవరం: అగ్నికుల క్షత్రియుల అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వ సహకారంతోపాటు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం నియోజకవర్గ అగ్నికుల క్షత్రియ యువజన సంఘం నాయకులు మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సంఘం భవనానికి స్థలం ఇప్పించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ స్థలం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే జ్ఞాపికను అందించారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో సంఘం అధ్యక్షుడు తిరుమాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పాడి మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు మైలా కృష్ణంరాజు, కొల్లాటి వెంకటరెడ్డి, మోకా సత్తిరాజు, బొమ్మిడి సత్యనారాయణ, తిరుమాని శ్రీను, మోకా ఏడుకొండలు పాల్గొన్నారు.

10 వరకు ఆధార్ ప్రత్యేక సేవలు



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అప్పారావు

భీమవరం (ప్రకాంశచౌక్): పట్టణంలోని తిరుమల జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ ఆఫీసర్, జిల్లా ఆధార్ మోనిటరింగ్ కమిటీ కన్వీనర్ కేసీహెచ్ అప్పారావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తేదీ వరకు ఆధార్ స్పెషల్ క్యాంప్‌లు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఎంపిక చేసిన జూనియర్ కాలేజీలలో ఏర్పాటు చేశామని చెప్పారు. కళాశాల విద్యార్థులకు బయోమెట్రిక్ అప్‌డేట్ చేస్తామన్నారు. ఈ ఆధార్ సెంటర్‌లో ఆధార్‌కు మొబైల్ నంబర్ లింక్, ఈ మెయిల్ ఐడీ లింక్ చేసుకోవచ్చని బయోమెట్రిక్, ఫొటో, ఐరిస్, ఫింగర్ ప్రింట్ అప్‌డేట్ చేసుకోవచ్చని, పేరు మార్పు, పుట్టిన తేదీ మార్పు చేసుకోవచ్చన్నారు. కానీ ఏదో ఒక ప్రూఫ్ తప్పనిసరిగా సమర్పించాలని తెలిపారు. అలాగే జెండర్ మార్పు, ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేట్ చిరునామా మార్పు, కొత్తగా ఆధార్ నమోదు తదితర సేవలు వినియోగించుకోవాలని, ఈ సేవలకు నిర్ణీత రుసుము చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు 53 ఆధార్ కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. భీమవరం డీఎల్‌డీఓ కె.కిషోర్‌కుమార్, ఏపీ ఆన్‌లైన్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎం.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ శరత్ పాల్గొన్నారు.

జంతు సంరక్షణపై అవగాహన ర్యాలీ



జంతు సంరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాంశచౌక్): జంతువులను ప్రేమించడం, ఆదరించడం భగవంతుడి సేవతో సమానమని, శారీరక ప్రక్రియ ప్రతి జీవికి జంతువులకు ఒక్కటేనని జిల్లా పశు సంవర్థక శాఖ ఏడీ జి.సత్యనారాయణ అన్నారు. ప్రభుత్వ జంతు సంక్షేమ సంఘం, భీమవరం పశువుల ఆసుపత్రి ఆధ్వర్యంలో జంతు సంక్షేమ అవగాహన కార్యక్రమాన్ని స్థానిక వస్తుల సాగరం మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ జంతు ప్రేమికులు తమ పెంపుడు జంతువులు మరణిస్తే మానసికంగా కుంగిపోతున్నారని, జంతువులను ప్రేమించాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ జంతువుల పరిరక్షణపై ప్రసంగించారు. అనంతరం ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం కోడె వెంకటరావు, సుంకర దాసు విద్యార్థులు పాల్గొన్నారు.

భవిష్యత్తు ప్రకృతి వ్యవసాయానిదే



పెదకాపవరం హైస్కూల్‌లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న వై.నూకరాజు

ఆకివీడు: రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయంపై రైతులు మరింత ఆసక్తి చూపుతారని ఏపీ ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వై.నూకరాజు అన్నారు. మండలంలోని పెదకాపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా ప్రకృతి పంటలపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఏ గ్రేడ్ మోడల్ కిచెన్ గార్డెన్‌ను తయారు చేసి ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి మొక్కలు సహజసిద్ధంగా ఎలా పెంచుకోవాలని వివరించారు. విద్యార్థులతో జీవామృతం తయారు చేయించారు. ఆకురసాలను తయారు చేసి ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ ఎం.అరుణకుమారి, జోనల్ కో-ఆర్డినేటర్ జీ.వెంకటరత్నం, డివిజన్ కో-ఆర్డినేటర్ ఆర్.రమణమ్మ, రమేష్, హెచ్‌ఎం కాళహస్తీశ్వరుడు, ఉపాధ్యాయులు బలరాముడు పాల్గొన్నారు.

బొబ్బనపల్లికి రూ.3.53 కోట్ల లబ్ధి



బొబ్బనపల్లిలో ఓమహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

వీరవాసరం: గత మూడున్నర ఏళ్ల కాలంలో బొబ్బనపల్లి గ్రామానికి మూడున్నర కోట్ల మేర సంక్షేమ లబ్ధి జరిగిందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బొబ్బనపల్లిలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని వివరిస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 338 కుటుంబాలు ఉండగా 328 కుటుంబాలకు రూ.మూడు కోట్ల 53 లక్షల మేర లబ్ధి జరిగిందని వివరించారు. వైఎస్సార్ పెన్షన్ కానుక 139 మందికి, జగనన్న అమ్మ ఒడి 79 మందికి, వైఎస్సార్ కాపు నేస్తం 30 మందికి, వైయస్సార్ చేయూత 50 మందికి, వైయస్సార్ రైతు భరోసా 170 మందికి, వైఎస్సార్ ఆసరా 193 మందికి, వైఎస్సార్ సున్నా వడ్డీ 234 మందికి, జగనన్న విద్యా దీవెన 32 మందికి, జగనన్న వసతి దీవెన 32 మందికి, వైఎస్సార్ వాహన మిత్ర నలుగురికి అందించడం జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన పట్ల ప్రజలు పూర్తిగా సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. 2019 ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటుగా ఇవ్వని హామీలను సైతం ప్రజలకు అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, వర్మ, గ్రామ సర్పంచ్ గూడూరి ఓంకార్, ఎంపీటీసీ గూడూరి ధనలక్ష్మి, కోటిపల్లి బాబు, మోపిదేవి స్వామినాయుడు, తన్నీడి సత్యనారాయణ, మారంపూడి సురేష్, సత్తి శారద, జెట్టి ప్రసాద్, పెచ్చేటి సత్యనారాయణ, పోలిశెట్టి దాసు, నరసాపురం పార్లమెంట్ వైసీపీ అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, మానుకొండ ప్రదీప్‌కుమార్, పోలిశెట్టి సత్యనారాయణ, చినమిల్లి వెంకట్రాయుడు, సర్పంచులు చికిలే మంగతాయారు, యర్రంశెట్టి శ్రీనివాస్, గెద్దం భారతి, నాగరాజు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

వేండ్రలో నాన్ లేఅవుట్‌లపై విచారణ



వేండ్ర లో నాన్ లే అవుట్ లను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీలు అమీర్ షరీఫ్, నవీన్

పాలకోడేరు: వేండ్రలో నాన్ లేఅవుట్ స్థలాల్లో నిర్మాణాల జరుగుతున్నాయని వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం డీపీఓ నాగలత ఆదేశాల మేరకు పాలకొల్లు, మొగల్తూరు ఈవోపీఆర్డీలు అమీర్ షరీఫ్, నవీన్ విచారణ చేశారు. గ్రామానికి చెందిన కదలి దుర్గారావు నాన్ లేఅవుట్ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని లోకాయుక్తకు చేసిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ చేశారు. కొన్నిచోట్ల తనిఖీలు చేసి రికార్డు చేసుకున్నారు. వీరి వెంట పంచాయతీ ఇంచార్జ్ కార్యదర్శి అమిజాల పోలయ్య, వీఆర్వో అలేఖ్య ఉన్నారు.

వేలంతో ద్వారా రూ.17,700 ఆదాయం

ఆకివీడు: వివిధ నేరాలలో పట్టుబడిన రెండు టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనాల్ని మంగళవారం స్థానిక కార్యాలయం వద్ద బహిరంగ వేలం వేశారు. ఎన్ఫోర్స్‌మెంట్ సహాయ సూపరింటెండెంట్ సీ. భార్గవ్ సమక్షంలో వేలం వేయగా రూ. 15 వేలకు పాడుకున్నారని, దానిపై 18 శాతం జీఎస్‌టీ రూ. 2,700లుతో మొత్తం రూ. 17,700లు వేలం పాట దారుడు చెల్లించి రెండు వాహనాల్ని తీసుకువెళ్లినట్లు సెబీ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ డీ.రామారావు చెప్పారు.

ఉండి లేఅవుట్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



ఉండి జగనన్న లేఅవుట్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న పీవీఎల్

ఉండి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే నిరుపేదల జీవితంలో వెలుగులు విరబూస్తున్నాయని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. మంగళవారం ఉండిలోని జగనన్న లేఅవుట్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సర్పంచ్ కమతం సౌజన్య, జెడ్పీటీసీ సభ్యులు రణస్తుల కనకదుర్గ, ఉప సర్పంచ్ గొట్టుముక్కల కల్యాణ్‌వర్మ ఆధ్వర్యంలో పీవీఎల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో నిరుపేదల సొంతింటి కల నెరవేరిందన్నారు. స్థలం ఇవ్వడమే కాక ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం, రుణం, ఇతర అవసరాలు తీరుస్తుండటమే కాక కాలనీల్లో సౌకర్యాలు మెరుగుపరుస్తున్నామన్నారు. రణస్తుల మహంకాళి, యేడిద వెంకటేశ్వరరావు, కమతం బెనర్జీ, గుండాబత్తుల సుబ్బారావు, విద్యుత్ ఏఈఈ మాధవరాజు, హౌసింగ్ ఏఈఈ డీ రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

పోలీసులూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



ఏఆర్ కానిస్టేబుళ్లకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ద్విచక్రవాహనాలు నడిపే సమయంలో పోలీసులు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఏఆర్ సిబ్బందికి హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలీసు సిబ్బంది కచ్చితంగా హెల్మెట్ ధరించి ప్రజలకు ఆదర్శవంతంగా నిలవాలని ఎస్పీ యు.రవిప్రకాష్ ఆదేశాల మేరకు జిల్లా అంతటా హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తూడు, గురప్పు డెక్క తొలగింపు



వెంకయ్య వయ్యేరు పంట కాలువలో తూడు తొలగిస్తున్న దృశ్యం

కాళ్ల: సాగు నీటికి ఇబ్బంది లేకుండా పంట కాలువలో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులను మంగళవారం చేపట్టారు. వెంకయ్య వయ్యేరు పంట కాలువలో ఏలూరు పాడు శివారులో తూడు, గుర్రపుడెక్క మేట వేయడంతో ప్రవాహం మందగించింది. దీంతో సాగునీటి కోసం రైతులు ఇబ్బంది పడకుండా అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా దాళ్వా పంటకు, మంచినీటి చెరువులు నింపుకునేందుకు ఇబ్బంది లేకుండా పంట కాలువలో చెత్త తొలగిస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ రాజు చెప్పారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు



ఇంటర్ పరీక్షలపై సమీక్షలో మాట్లాడుతున్న డీఆర్వో కృష్ణవేణి, వేదికపై చంద్రశేఖర్‌బాబు

సాక్షి, భీమవరం: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని డీఆర్వో కె కృష్ణవేణి అన్నారు. మంగళవారం భీమవరం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో రీజనల్ కన్వీనర్ కె.చంద్రశేఖర్‌బాబు అధ్యక్షతన ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై డీఆర్వో అధికారులతో సమీక్షించారు. మార్చి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగే ఇంటర్ పరీక్షలకు జిల్లాలో 10 ప్రభుత్వ కళాశాలలు, మూడు ఎయిడెడ్ కళాశాలలు, 39 ప్రైవేట్, అన్ ఎయిడెడ్ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా, వాటిలో 34,642 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. సీసీ కెమెరా నిఘాలో పరీక్షలు నిర్వహిస్తామని, మొత్తం 52 పరీక్షా కేంద్రాలు, 12 స్టోరేజ్ కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. పరీక్షా సమయాలకు అనుగుణంగా రవాణా సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. భీమవరం మునిసిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

మూడంచెలుగా రీ సర్వే

ఆకివీడు: భూముల రీ సర్వే మూడంచెలుగా కొనసాగుతుందని సర్వే ఆఫ్ ఇండియా అధికారి శ్రీరామమూర్తి చెప్పారు. చెరుకుమిల్లిలో మంగళవారం రీ సర్వే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ డ్రోన్ సాయంతో గ్రామాల్లోని సర్వే భూముల ఫొటోలు తీసి వాటి ఆధారంగా సర్వే నంబర్లతో భూమి యజమాని హద్దులు తెలుస్తాయన్నారు. భూమి యజమానుల వివరాలు సేకరించి, అభ్యంతరాలున్న వాటిని సరిజేసి, లేనివాటిని భూమి రికార్డుల్లో నమోదు చేస్తామన్నారు. అన్నీ సవ్యంగా ఉంటే పట్టాదారు పాస్‌పుస్తకాలు అందజేస్తామన్నారు. సర్పంచ్ నందమూరి ప్రకాశం, సొసైటీ మాజీ అధ్యక్షులు దాట్ల బోసురాజు, వైస్ ఎంపీపీ సైదాల సూర్యనారాయణ, ఆర్బీకే చైర్మన్ మంతెన రాంబాబు రాజు పాల్గొన్నారు.

పేద మహిళలకు కుట్టు మెషీన్ల పంపిణీ



భీమవరంలో రాజ్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పేద మహిళల అభివృద్ధికి రాజ్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 11వ వార్డు రాజ్ ట్రస్ట్ కార్యాలయంలో 15 మంది దళిత మహిళలకు ఉచితంగా కుట్టు మెషీన్లు పంపిణీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రామాభాయి అంబేడ్కర్ 126వ జయంతి సందర్భంగా రాజ్ ట్రస్ట్ ఫౌండర్ గంటా రాజ్‌కుమార్ ఇటువంటి సేవాకార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.సైమాన్, పాలపర్తి జోనా, డి.సతీష్, సాదె మహేష్ పాల్గొన్నారు.